
సాక్షి కాకినాడ

బుధవారం । 21 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన తాళ్లూరి వీరలక్ష్మీ నారాయణ మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 1,590, సెంట్రల్ 1,140, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
41.0°/27.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.0	28.0
కాకినాడ	35.6	27.5
అమలాపురం	37.0	28.0



యోగ భాగ్యాలు

- ఆసనాల అభ్యాసంతో ఆరోగ్య బాట
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా.. ప్రపంచానికి మనదేశం అందించిన అద్భుత వరం. శరీరాన్ని..మనసును సంయోగం చేసే ఉత్తమ మార్గం.. ఆసనాలు అవయవాలను పటిష్టం చేస్తే.. ధ్యానం మనసును నియంత్రిస్తుంది. ఇది యోగా విశిష్టత. అందుకే ప్రపంచ దేశాలూ ఈ బాట పట్టాయి. పతంజలి చూపిన యోగా గొప్పదనాన్ని యూఎన్‌ఓ 2014లో గుర్తించింది. జూన్ 21వ తేదీని యోగా దినోత్సవంగా ప్రకటించింది. కరోనా నేపథ్యంలో ప్రజలందరిలో ఆరోగ్య స్పృహ పెరిగింది. ముఖ్యంగా యోగాతో ఎలాంటి మహమ్మారినైనా ఎదుర్కొనవచ్చునని గ్రహించారు. గడచిన రెండేళ్లలో యోగా నేర్చుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. పట్టణాల్లో వెల్‌నెస్ సెంటర్లలో దీనికి ప్రాధాన్యతనిస్తున్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ముద్రలను అల్లోపతి వైద్యానికి ప్రత్యామ్నాయ చికిత్సలో భాగంగా విశ్వసిస్తున్నారు. అమెరికా వంటి దేశాలు సైతం యోగాలోని వైద్య గుణాలను ఆమోదిస్తున్నాయి. యోగా థెరపీని అమలు చేస్తున్నాయి. ఆధునిక జీవన శైలిలోని ప్రతి రుగ్మతకూ యోగాలో పరిష్కార మార్గం చూపుతోందని విదేశీ వైద్యులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ అద్భుత ప్రక్రియ దైనందిన జీవనంలో ఒక భాగం కావాలని ప్రపంచ వ్యాప్తంగా ఎందరో వైద్య నిపుణులు చెబుతున్నారు. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం. ఈ రంగంలో విశేష కృషి చేస్తున్న కొందరి గురించి తెలియజేసే ప్రయత్నమిది.

సంపూర్ణ ఆరోగ్యానికి బాట

నల్లజర్ల: యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చునని యోగా గురువు దూబగుంట్ల రాజారావు చెబుతున్నారు. దూబచర్లకు చెందిన దూబగుంట్ల రాజారావు అదే గ్రామంలో జెడ్పీ హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు.. గ్రామంలో పెద్దలకు యోగా నేర్పుతూ మన్ననలు పొందుతున్నారు. దాదాపు 32 గ్రామాల్లో యోగా శిక్షణ శిబిరాలు ఉచితంగా నిర్వహించారు. జిల్లాలో 800 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే తన లక్ష్యమని యోగాగురువు రాజారావు చెబుతున్నారు. ఏటా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిబిరాల ద్వారా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఏమన్నారంటే.. ఆధునిక ప్రపంచంలో ఉదయం లేచింది మొదలు కాలంతో పోటీ పడాల్సి వస్తోంది. విద్యార్థులూ ఒత్తిడికి గురవుతున్నారు. సమయానికి తిండి లేకుండా రాత్రి వేళ నిద్ర లేమితో బాధపడుతున్నారు. మారిన ఆహారపు అలవాట్లతో కొందరు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఏ చిన్న జబ్బు చేసినా తట్టుకునే పరిస్థితి లేదు. వీటన్నింటిని దూరం చేసేందుకే యోగ చక్కని ఔషధంలా పనిచేస్తుంది. యోగా సాధనతో పిల్లల మానసిక ప్రవర్తనలో మార్పు కనపడింది. రోజూ యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని రాజారావు చెప్పారు. . మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా తప్పనిసరి అన్నారు.



యోగాభ్యాసంలో చిన్నారులు

తొలి మందు యోగా



పిరమిడ్‌లోని ధాన్యపు తోరణం కింద డాక్టర్ గౌరీశేఖర్ ధ్యానం

కాకినాడ క్రైం: మానసిక వేదనల వల్ల శారీరక ఆరోగ్యం చెడిపోకుండా ధ్యానం, యోగ ఎంతగానో దోహదపడతాయని కాకినాడకు చెందిన డాక్టర్ గౌరీశేఖర్ వివిధ అధ్యయనాల ద్వారా తెలుసుకున్నారు. వైద్య సేవలు కొనసాగిస్తూనే యోగ, ధ్యానానికి విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే పిరమిడ్ యోగాపై దృష్టి సారించారు. ఆసుపత్రి మేడపై ఓ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని నిర్మించారు. హైదరాబాద్ ఇంజినీర్ల పర్యవేక్షణలో నిర్మించిన ఈ పిరమిడ్ నిర్మాణం పూర్తిగా ప్రత్యేకమైనది. సూర్యుని కిరణాల్లోని కాస్మిక్ కిరణాలను వేరు చేసి కొన్ని మీటర్ల దూరం విస్తరించేలా ప్రత్యేక లోహపు కప్పును పిరమిడ్ శిఖరాగ్రంపై ఉంచారు. మనసుకు ప్రశాంతతనిచ్చే ఇంద్రధనస్సులోని సప్త వర్ణాలతో పిరమిడ్‌ను చూడముచ్చటగా తీర్చిదిద్దారు. పిరమిడ్ ఆవరణాన్నీ అందమైన పూల మొక్కలు, ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహంతో అలంకరించారు. ఈ పిరమిడ్‌లో డాక్టర్ గౌరీశేఖర్ నిత్యం యోగాసనాలు వేస్తూ ధ్యాన ముద్రలో గడుపుతుంటారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందితో పాటు పరిచయస్తులందరికీ ధ్యాన కేంద్రంలో యోగా ప్రయోజనాలను అందిపుచ్చుకునే ఏర్పాట్లు చేశారు. కరపత్రాల పంపకం, సోషల్‌మీడియా వేదికగా యోగా ప్రయోజనాలను విస్తృతం చేస్తూ విశేష ప్రచారం కల్పిస్తున్నారు.



గిరిజన విద్యార్థులకు యోగా నేర్పిస్తున్న శ్రీనివాస్ (ఫైల్)

సెంట్రల్ జైల్‌లో యోగా

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో మొదలైన అతని యోగా ప్రయాణం మొదలై దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించింది. ఒక్కడిగా మొదలయ్యాడు వేలమందికి స్ఫూర్తిగా నిలిచాడు. అతడే యోగా గురువు పతంజలి శ్రీనివాస్. స్వామి రాందేవ్ బాబా శిష్యుడిగా యోగా జీవితం ప్రారంభించాడు. ప్రణవ సంకల్ప యోగ సమితి స్థాపించి 15 సంవత్సరాలుగా 350 ఉచిత యోగా శిబిరాలను నిర్వహించాడు. ఖైదీలలో మానసిక పరివర్తన తీసుకువచ్చాడు. 15 హత్యలు చేసిన గ్యాంగ్‌స్టర్ ప్రతాప్‌సింగ్ కూడా యోగాతో యోగాస్టార్‌ని చేశాడు. ఐటీడీఏ అధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలోని 103 గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలలో యోగ విద్యను నేర్పించాడు. సింగపూర్ తెలుగు సమాజం ఆధ్వర్యంలో యోగ శిక్షణ తరగతులు నిర్వహించారు. అంధ, చెవిటి, మూగ విద్యార్థులకు సైతం కూడా ఈ అంశంలో తర్ఫీదునిచ్చాడు. ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ అనుమతితో, ఓఎన్‌జీసీ ఆర్థిక సహాయంతో, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 30 మంది ఖైదీలకు 9 నెలలపాటు యోగ శిక్షణ ఇచ్చాడు. ఈ నెలలో తానా ఆహ్వానం మేరకు అమెరికా వెళుతున్నాడు. వివిధ నేరాలకు సంబంధించి ఇక్కడి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించిన ప్రతాప్ సింగ్ కూడా శ్రీనివాస్ దగ్గర యోగా నేర్చుకున్నాడు. విడుదలయ్యాక యోగా గురువుగా మారి అందరికీ నేర్పిస్తున్నాడు.

ఆసనాలు నెమ్మదిగా వేయాలి



మనసును ప్రశాంతంగా ఉంచుకుని శ్వాస మీదే ధ్యాస పెట్టాలి. నెమ్మదిగా ఆసనాలు వేయాలి. వేగంగా ఆసనాలు వేయడం వల్ల ఫలితం ఉండదు. యోగా చివరిలో ప్రశాంతంగా శవాసనం వేయాలి. దీనివల్ల శరీరంతో పాటు మనసు కూడా ప్రశాంతంగా ఉంటుంది. శ్వాస ప్రక్రియలు.. అంటే గాలిని లోపలకి పీల్చుతూ బయటకు వదలడం, ప్రాణాయామంతో యోగాను ఆరంభించాలి. దీని వల్ల ఎక్కువ సేపు యోగా చేయవచ్చు. ఆహారాన్ని తీసుకున్న తర్వాత యోగా చేయకూడదు. అందుకే ఎక్కువ మంది ఉదయాన్నే లేచి పరగడుపున చేస్తారు. ఆసనాలకు ఓ అరగంట ముందు చిన్న గ్లాసు నీరు తాగొచ్చు. యోగాను ఎలాపడితే అలా చేసేయకుండా ఒక క్రమపద్ధతిలో చేయాలి. అవగాహన లేకపోతే గురువుల వద్ద శిక్షణ పొందాలి. అనారోగ్యంతో ఉంటే యోగాసనాలు వేయకూడదు.

– జ్యోతుల నాగేశ్వరరావు, యోగా గురువు, గొల్లప్రోలు

దేశమంతా తిరుగుతూ..



దేశ సంచారంలో ఉండగా ఆయా ప్రదేశాల్లో యోగా సాధన చేస్తున్న దృశ్యం

రాజానగరం: నిరంతరం యోగా సాధనతో ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పొందవచ్చునని సంచార యోగిగా గుర్తింపు పొందిన చెందిన పెన్నాడ మోహన్ చెబుతున్నారు. ఈయనది రాజానగరం మండలం దివాన్‌చెరువు. దేశంలో వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి విశేషాలను సేకరించడం ఈ యువకుని హాబీ. మోహన్ యోగా సాధనలోనూ ప్రావీణ్యాన్ని పొందాడు. గత ఎనిమిదేళ్లలో 22 రాష్ట్రాల్లో సుమారు 5150 కి.మీ. వరకు సైకిల్‌పై ప్రయాణించాడు. చాలా చోట్ల ఉష్ణోగ్రతలలో వ్యత్యాసాలు, వాతావరణంలో మార్పులు ఎదురైనా యోగా సాధన ద్వారా నిరోధించగలిగానంటున్నాడు. ఒకసారి పత్రాజీ అనే యోగా గురువు పరిచయమయ్యారు. ఆయన దగ్గర యోగా శాస్త్రాన్ని నేర్చుకున్నాడు. పతంజలి అష్టాంగయోగా మార్గంలో పయనించేలా చేశారని మోహన్ తన యోగాభ్యాసన, సాధనల గురించి వివరించాడు. గురువు పర్యవేక్షణలో యోగా నేర్చుకుంటే సరైన ఫలితాలను పొందవచ్చని మోహన్ అభిప్రాయపడుతున్నాడు.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ రత్నగిరి సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పండితులు నిర్వహిస్తున్న వరుణ జపాలు బుధవారంతో ముగియనున్నాయి. వరుణజపాలు నాలుగో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. ఉదయం 7–30 గంటలకు దర్బారు మండపంలో స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద పండితులు ఋష్య శృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం విగ్రహంతో ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహిస్తూ వరుణుని ఆహ్వానిస్తూ మంత్రాలు పఠించారు. దర్బారు మండపంలో సుబ్రహ్మణ్య ఆవాహన, వారుణాక వాక మంత్ర పఠనము, వరుణ జపాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. స్వామి, అమ్మవార్లకు, ఋష్యశృంగమహర్షికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, చిట్టి శివ, ముష్టి పురుషోత్తమ్, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, అర్చకులు దత్తాత్రేయశర్మ, సుధీర్, కంచిభట్ల రామ్‌కుమార్, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ, పాలంకి పట్టాభి, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్పీకి 13 ఫిర్యాదులు



డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ఫిర్యాదుదారుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ శాఖ పరిధిలో 'డయల్ యువర్ ఎస్పీ' కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదుదారులతో ఫోన్‌లో మాట్లాడి వివిధ ఫిర్యాదులు స్వీకరించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 13 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలనుకునేవారు ప్రతి మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 0884 2371744 నంబరుకు డయల్ చేయాలని కోరారు.

రైజ్ కార్యక్రమం అమలుకు చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉద్దేశించిన రెడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచ్యుయేషనల్ ఇంగ్లిష్ (రైజ్) కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గంలో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కోర్టు హాల్‌లో రైజ్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గతేడాది ఆగస్టు 1న తుని నియోజకవర్గంలోని పాఠశాలల్లో రైజ్ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. తర్వాత దశల వారీగా కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, పిఠాపురం నియోజకవర్గాలోని పాఠశాలల్లో అమలు చేసినట్లు తెలిపారు. సరళీకృత విధానాల ద్వారా ఇంగ్లిష్ స్పీకింగ్ నైపుణ్యాలను పెంపొందించే రైజ్ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తున్నందున త్వరలో జగ్గంపేట నియోజకవర్గంలోనూ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా నిపుణులు రూపొందించిన రైజ్ మాడ్యూల్ పుస్తకాలను సిద్ధం చేయాలన్నారు.

ఎవరో ఇస్తే వచ్చేది కాదు సీఎం పదవి

- ప్రజావిశ్వాసంతోనే ఆ కుర్చీ సాధ్యం
- వాస్తవాలు తెలుసుకుని రాజకీయాలు చేయ్
- పవన్ కల్యాణ్‌కు కన్నబాబు హితవు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కన్నబాబు, చిత్రంలో ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ నేతలు

సాక్షిప్రతినిధి,కాకినాడ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమ్మెల్యే అవ్వాలన్నా, సీఎం అవ్వాలన్నా ఎవరో చేస్తే అయ్యేది కాదని జనసేన అధినేత పవన్ గుర్తెరిగి వ్యవహరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు హితవు పలికారు. జన విశ్వాసం పొందితేనే ఇది సాధ్యమవుతుందన్నారు. మంగళవారం ఇక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్ రౌడీలు, హంతకులు, సన్నాసులు వంటి పదాలు వైఎస్సార్ సీపీ నాయకులు ఉద్దేశించి మాట్లాడటం ఎంతవరకు సబబన్నారు. బాబాయ్ హత్య కేసు విషయంలో అన్నీ చేస్తున్నారన్నట్టు సీఎంను ఉద్దేశించి ప్రచారం చేయడం పద్ధతి కాదన్నారు. రాజకీయాల్లో జగన్‌మోహన్‌రెడ్డి పట్ల జెలసీ సరికాదన్నారు. పవన్ తీరుకు కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం లేఖ దర్పణం పడుతుందన్నారు. ముద్రగడ పదవుల కోసం పాకులాడే నాయకుడు కాదన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే మూడు వేల పోలీసులను పెట్టి ఇంటిలో మహిళలను అవమానించి కర్ఫ్యూ వాతావరణం నెలకొల్పిన చంద్రబాబు హయాం గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్నాయని చెబుతున్న పవన్ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ, రైల్వే జోన్ కోసం పోరాడాలన్నారు. 2019లో 2600 మంది యువతుల అదృశ్యమైనట్టు చెప్పిన పవన్ వారిలో కేవలం 9 మంది ఆచూకీ లభించని విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డిపై అవాకులు చెవాకులు పేలిన పవన్ ఆయన చేసిన సవాల్ స్వీకరించి కాకినాడలో పోటీపై స్పష్టత ఇవ్వలేకపోయారన్నారు.

దిగజారుడు పదజాలం: గీత

పవన్ వాడే పదజాలం చూస్తుంటే రాజకీయాల్లోకి రావాలనే యువతకు ఏమని సమాధానం చెబుతామని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. పోటీ ఉండాలంటే రాజకీయ పార్టీలు ఉండాలని కోరుకుంటామన్నారు. జనసేనతో యువతను చైతన్యపరుస్తారని చూస్తుంటే దిగజారుడు పదజాలంతో మాట్లాడటం సహేతుకం కాదన్నారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, సీఎంపైన పవన్ వ్యాఖ్యలు నీచంగా ఉన్నాయన్నారు. ప్రజాప్రతినిధులపై చులకనగా మాట్లాడటం సభ్యత కాదన్నారు. నాయకత్వమంటే జనం ఆశీర్వాదంతో 151 సీట్లు గెలుపొందిన జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. పవన్ ఒక రాజకీయ పార్టీకి నాయకుడిగా నడుచుకుంటే బాగుంటుందన్నారు.

తోకముడిచిన పవన్: ద్వారంపూడి

కాకినాడ నుంచి తనపై పోటీ చేయాలని చేసిన సవాల్‌కు సమాధానం ఇవ్వకుండా పవన్‌కళ్యాణ్ తోకముడిచి కాకినాడ విడిచి పారిపోయారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎద్దేవా చేశారు. ఇలా వెళ్లిపోవడమంటే ఆరోపణలు వెనక్కు తీసుకున్నట్టే లెక్క అన్నారు. చంద్రబాబు వ్యూహం ప్రకారం తనను తిట్టేందుకే కత్తిపూడి, పిఠాపురం, కాకినాడ రూరల్‌లో సభలు పెట్టినట్టుగా కనిపిస్తోందన్నారు. కాపు, రెడ్డి సామాజికవర్గాలు చాలా సఖ్యంగా ఉంటాయన్నారు. తనపై వ్యాఖ్యలకు జనం తిరగబడితే ఒక రెడ్డి ఎమ్మెల్యే ఇలా చేశాడని ప్రచారం చేయాలనే చంద్రబాబు, పవన్ కుట్ర పన్నారన్నారు. పోటీకి వీరమహిళ చాలు అని కందుల దుర్గేష్, ముత్తా శశిధర్ చాలని పంతం నానాజీ ఇలా చెబుతుంటే వారిలో వారికే స్పష్టత లేదని అర్థమవుతోందన్నారు. తమ కుటుంబం కోసం తెలిసిన పెద్దమనిషిగా కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం లేఖ విడుదల చేశారన్నారు. కాపులతో తమ కుటుంబానికి ఉండే సాన్నిహిత్యాన్ని ఈ లేఖ స్పష్టం చేసిందన్నారు. కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థిని కర్రి పద్మశ్రీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె

- ఆన్‌లైన్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్‌కు 24 తుది గడువు
- వచ్చే నెల 4 నుంచి తరగతులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లు చేపట్టనున్నారు. జిల్లాలోని రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరుల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిల్లో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సులలో సుమారు 2,800 వరకూ సీట్ల భర్తీకి అవకాశముంది. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ సాధారణ కోర్సులతో పాటు, కంప్యూటర్, మార్కెట్ ఓరియెంటెడ్, స్కిల్ ఓరియెంటెడ్, ఒకేషనల్ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు apsche.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దగ్గర్లోని డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ ఫీజు ఉంటుంది. ఫీజుల భారం పేద విద్యార్థుల కుటుంబాలపై పడకుండా, రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా దీవెన ద్వారా ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఆ మొత్తాలను ఆయా విద్యార్థులు కళాశాలల్లో చెల్లించాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్

ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 21 నుంచి 23వ తేదీ వరకూ ఫిజికల్లీ ఛాలెంజ్డ్/సీఏసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్/ఎన్‌సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్లు ఉంటాయి. వీటిని ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. కోర్సుల ఎంపికకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. వచ్చే నెల 3న సీట్లు కేటాయించి, అలాట్ అయిన విద్యార్థులకు ఎంపికైన కళాశాలల్లో 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డిగ్రీ కళాశాలలు

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	అటానమస్
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	7	45	1
తూర్పు గోదావరి	6	40	1
కాకినాడ	5	46	3

నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు

జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టింది. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అమలు చేస్తున్నారు. వీటిలో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా, ఒక్కటే మేజర్ సబ్జెక్టు ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి.. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో ఈ మూడింటిలో ఏదో ఒకటి మేజర్ సబ్జెక్టుగా ఎంచుకోవాలి. నచ్చిన మరొకటి మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవాలి.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై 24న ఉచిత అవగాహన సదస్సు

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ ఎగ్జామ్స్ కలిసి ఈ నెల 24వ తేదీ (శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కాకినాడ కల్పన సెంటర్ సమీపాన దంటు కళాక్షేత్రంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే. త్వరలోనే 1000కిపైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం, దీనికితోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 89850 94499 నంబరుకు తమ పేరు, ఫోన్ నెంబరు, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

SAKSHI MEDIA GROUP

www.sakshi.com

అవగాహన సదస్సు తేదీ: ఈ నెల 24 (శనివారం)

వేదిక: దంటు కళాక్షేత్రం.. మున్సిపల్ ఆఫీస్ వెనుక, కల్పన సెంటర్, కాకినాడ

సమయం: ఉదయం 09 : 00 నుంచి 12 : 30 వరకు

క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ జోనల్‌ ఇన్‌చార్జిగా ఏడుకొండలు


గుల్లా ఏడుకొండలు (ఫైల్‌)

గోకవరం: వైఎస్సార్‌ సీపీ ఎస్సీ సెల్‌ జోనల్‌ ఇన్‌చార్జిగా గోకవరానికి చెందిన సీనియర్‌ నాయకుడు గుల్లా ఏడుకొండలు నియమితులయ్యారు. కాకినాడ, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల ఎస్సీ సెల్‌ జోనల్‌ ఇన్‌చార్జిగా ఆయనను నియమించారు. మండలంలోని ఇటికాయలపల్లికి చెందిన ఏడుకొండలు సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యునిగా పని చేశారు. న్యాయవాదిగా పని చేస్తూ సుదీర్ఘ కాలం నుంచి రాజకీయాల్లో చురుకుగా పని చేస్తున్నారు. సీనియర్‌ రాజకీయ నాయకుడిగా ఉన్న ఆయనను జోనల్‌ ఇన్‌చార్జిగా నియమించడంపై వైఎస్సార్‌ సీపీ మండల, దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్‌ కో ఆర్డినేటర్లు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్‌, కాకినాడ ఎంపీ వంగా గీత, పార్టీ కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షులు కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబులకు ఏడుకొండలు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారం చేపట్టడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

పెద్దాపురం: వచ్చే విద్యా సంవత్సరం (2024–25)లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జవహర్‌ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌ కె.రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆరో తరగతికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 21 నుంచి ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఎటువంటి అంతరాయం లేకుండా ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. 2012 మే 1 నుంచి 2014 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్‌ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని రామిరెడ్డి సూచించారు.

అభ్యసనానికి తర్ల్‌దాం

- కనీస అభ్యసన స్థాయి పెంపుదలే లక్ష్యం
- రెండు దశల్లో ఎస్‌జీటీలకు ఆన్‌లైన్‌ శిక్షణ
- 24 వరకూ మొదటి విడత



రాయవరం: విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తోంది. విద్యార్థుల్లో అభ్యసన స్థాయి తక్కువగా ఉండటంతో వారు పై తరగతులకు వెళ్లేటప్పటికి చదవడం, రాయడం నేర్చుకోలేకపోతున్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థికి అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ, ప్రథమ్‌ సంస్థ సంయుక్తంగా 'టీచింగ్‌ ఎట్‌ రైట్‌ లెవెల్‌' (టీఏఆర్‌ఎల్‌ – తర్ల్‌) కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గత విద్యా సంవత్సరం తొలుత కొన్ని పాఠశాలల్లో పైలట్‌ ప్రాజెక్టుగా అమలు చేసి, విజయవంతమైన అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ నవంబర్‌ 1వ తేదీ నుంచి విద్యా శాఖ అమలు చేసింది.

అభ్యసన స్థాయికి అనుగుణంగా..

తర్ల్‌ కార్యక్రమాన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలు చేయనున్నారు. 3, 4, 5 తరగతుల్లో విద్యార్థి అభ్యసన స్థాయి ఎలా ఉందో తెలుసుకుని, అందుకు అనుగుణంగా బోధన చేయడమే తర్ల్‌ ముఖ్య ఉద్దేశం. తొలుత ప్రతి విద్యార్థికీ బేస్‌లైన్‌ పరీక్ష నిర్వహించి, వారి అభ్యసన స్థాయిని ఉపాధ్యాయుడు తెలుసుకుంటాడు. అనంతరం తెలుగు, గణితంలో విద్యార్థి స్థాయి ఆధారంగా రెండు గ్రూపులుగా విభజిస్తారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఆటపాటల ద్వారా బోధిస్తారు. ఇందుకు పాఠ్య ప్రణాళిక ప్రథమ్‌ సంస్థ సరఫరా చేస్తుంది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట పాటు ప్రత్యేక బోధన చేస్తారు. ఈ విద్యా సంవత్సరం చివరి వరకూ తర్ల్‌ ప్రోగ్రామ్‌ అమలు చేస్తారు. విద్యా సంవత్సరం ముగిసేలోగా మధ్యలో మిడ్‌లైన్‌, చివరిలో ఎండ్‌లైన్‌ పరీక్షలు నిర్వహిస్తారు.

1,256 మందికి శిక్షణ

ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా స్థాయి రీసోర్స్‌ పర్సన్లకు, సీఆర్‌పీలకు స్టేట్‌ రీసోర్స్‌ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. ప్రతి మండలం నుంచి ఒక కాంప్లెక్స్‌ హెచ్‌ఎం, ఇద్దరు ఎస్‌జీటీల చొప్పున 88 మందికి మండల లెవెల్‌ రీసోర్స్‌ పర్సన్లుగా శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 3, 4, 5 తరగతులు బోధిస్తున్న 1,256 మంది ఉపాధ్యాయులకు రెండు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన రీసోర్స్‌ పర్సన్లు, సీఆర్‌పీలు రెండు దశల్లో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఉపాధ్యాయులకు రెండు దశల్లో శిక్షణ

తర్ల్‌ ప్రోగ్రామ్‌ బోధనాభ్యసన పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు రెండు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. 3, 4, 5 తరగతులు బోధించే వారికి ఈ నెల 24 వరకూ మొదటి దశ శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ ఇప్పటికే ప్రారంభమైంది. జూలై 1 నుంచి 7వ తేదీ వరకూ రెండో విడత శిక్షణ ఇస్తారు. మండల లెవెల్‌ రీసోర్స్‌ పర్సన్లుగా శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌ (వెబెక్స్‌) ద్వారా రోజుకు మూడు గంటల చొప్పున శిక్షణ ఇస్తారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు బోధించే వారు, 3 నుంచి 10వ తరగతి ఉన్న ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులకు తెలుగు, గణితం బోధించే ఉపాధ్యాయులు ఈ శిక్షణకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఆసక్తి పెరుగుతుంది



విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధించడం వలన ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందుతుంది. విద్యార్థులు వెనుకబాటుతనానికి లోనవరు. దీని వలన వారిలో అభ్యసన పట్ల ఆసక్తి బాగా పెరుగుతుంది.

– సీహెచ్‌ సురేష్‌, జిల్లా కో ఆర్డినేటర్‌, ప్రథమ్‌ సంస్థ, అమలాపురం/రామచంద్రపురం

ఏర్పాట్లు పూర్తి



తర్ల్‌ ప్రోగ్రామ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. 3, 4, 5 తరగతులు బోధించే ఉపాధ్యాయులందరూ శిక్షణలో పాల్గొనాలి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తున్నాం.

– ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

తాగుబోతుల మధ్య తోపులాట

తీవ్ర గాయాలతో ఒకరి మృతి

తాళ్లరేవు: పూటుగా మద్యం తాగిన ఇద్దరి మధ్య జరిగిన తోపులాట ఒకరి ప్రాణాన్ని బలిగొంది. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్‌, స్థానికులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. యానాం కురసాంపేటకు చెందిన నిమ్మకాయల సురేష్‌ (48) నీలపల్లి చెక్‌పోస్టు సెంటర్‌కు ఇల్లు మారేందుకు గానూ జార్జీపేటకు చెందిన దాసరి నాగరాజు సహాయం తీసుకున్నాడు. సామాన్లను తరలించిన అనంతరం ఇద్దరూ కలిసి యానాం పాత వంతెన సమీపాన కూర్చుని పూటుగా మద్యం తాగారు. ఆ మత్తులో ఒకరినొకరు వెటకారాలు ఆడుకుంటూ తోసుకున్నారు. ఈ క్రమంలో అదుపు తప్పి, ఒక్కసారిగా వెనక్కి పడిపోవడంతో సురేష్‌ తలకు తీవ్ర గాయమైంది. అతడిని స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని కాకినాడ రూరల్‌ సీఐ పి.శ్రీనివాసరావు పరిశీలించారు. ఇద్దరూ కలిసి పనులు చేసుకుంటూంటారని, ఒకరినొకరు డాడీ, కొడుకా అంటూ పలకరించుకుంటూ ఉండేవారని, వారి మధ్య ఇలా జరగడం దురదృష్టకరమని పలువురు అన్నారు. ఇదిలా ఉండగా గత నెల 14వ తేదీన 216 జాతీయ రహదారిపై సుబ్బారాయుని దిమ్మ వద్ద ఆటోను, ప్రైవేటు బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతుడు సురేష్‌ తల్లి నిమ్మకాయల లక్ష్మి మృతి చెందింది. నెల రోజుల వ్యవధిలోనే తల్లి, కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కోరంగి ఎస్సై శ్రీనివాస కుమార్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముద్రగడపై పవన్‌ విమర్శలు దారుణం

- ఆయనకు రాజకీయ పరిణతి లేదు
- ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబును ఎందుకు ప్రశ్నించరు?
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజం


ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: కాపుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన ముద్రగడ పద్మనాభంపై జనసేన అధ్యక్షుడు పవన్‌ కల్యాణ్‌ కల్యాణ్‌ విమర్శలు చేయడం దారుణమని వైఎస్సార్‌ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముద్రగడపై వారాహి యాత్ర సందర్భంగా పవన్‌ కల్యాణ్‌ విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. పవన్‌ కల్యాణ్‌ 2014లో చంద్రబాబు పల్లకీ మోశారని, కాపు రిజర్వేషన్లు, కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.వెయ్యి కోట్ల నిధుల మంజూరుపై ఇచ్చిన హామీలను టీడీపీ అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాటు పట్టించుకోలేదని గుర్తు చేశారు. అటువంటి చంద్రబాబుపై లేవని పవన్‌ కల్యాణ్‌ గొంతు.. ఆ డిమాండ్ల సాధనకు పోరాడిన ముద్రగడపై లేవడం దుర్మార్గమని మండిపడ్డారు. నాడు ముద్రగడ, కుటుంబ సభ్యులపై చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను కాపులతో పాటు ఎస్సీ, బీసీ నాయకులు కూడా తప్పు పట్టారన్నారు. తునిలో ముద్రగడ ఆధ్వర్యాన జరిగిన ఉద్యమ సమయంలో కూడా షూటింగ్‌ నుంచి మధ్యలో హుటాహుటిన వచ్చిన పవన్‌ కల్యాణ్‌.. చంద్రబాబు ప్రభుత్వానికి మద్దతుగా చేసిన ప్రకటనను ఎవరూ మరచిపోలేదని రాజా అన్నారు. 2014–19 మధ్య కానిస్టేబుల్‌ను కూడా బదిలీ చేయలేని హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం మినహా కాపులకు చంద్రబాబు చేసిందేమీ లేదని గుర్తు చేశారు. కాపుల కోసం నాడు చంద్రబాబు ప్రభుత్వాన్ని పవన్‌ కల్యాణ్‌ ఏ రోజూ ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. కాపు సామాజిక వర్గాన్ని రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నది కచ్చితంగా పవన్‌ కల్యాణ్‌ మాత్రమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పవన్‌ సభలకు వస్తున్న జనం కాపు సామాజికవర్గం వారేనని, ఆయనకు మద్దతుగా సోషల్‌ మీడియాలో స్పందిస్తున్నదీ వారేనని అన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ స్థాపన నాటి నుంచి కాపులే మద్దతు పలికారని గుర్తు చేశారు. నేడు కాపునేస్తం వంటి పథకాలతో కాపులకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తున్నారు కాబట్టి, ఏదో ఒక విధంగా కాపుల ఓట్లు చీల్చి, చంద్రబాబుకు మేలు చేయాలనే పవన్‌ కల్యాణ్‌ చూస్తున్నారని రాజా ఆరోపించారు.

స్త్రీనిధి నిధులు స్వాహా

- సుమారు రూ.12 లక్షలు కాజేసినట్టు వీఓఏపై ఆరోపణలు
- జిల్లా స్త్రీనిధి మేనేజర్‌ విచారణ
- హాజరైన వీఓఏ తండ్రి
- తిరిగి చెల్లించేందుకు లిఖిత పూర్వకంగా హామీ


డ్వాక్రా మహిళలను వివరాలు అడుగుతున్న స్త్రీనిధి జిల్లా మేనేజర్‌ రత్నకుమారి

పెరవలి: డ్వాక్రా మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న భారీగా స్త్రీనిధి నిధులు కాజేసిన వైనం వెలుగులోకి వచ్చింది. గుట్టు చప్పుడు కాకుండా డ్వాక్రా మహిళల పేరిట తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడం, ఆ సంఘం కార్యకలాపాలపై ఆడిటింగ్‌ చేయించకపోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలివీ.. పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో 8 గ్రామ సంఘాలుండగా వాటి పరిధిలో 310 డ్వాక్రా గ్రూపులున్నాయి. వీటిలో 7వ గ్రామ సంఘానికి మొల్లేటి శ్రీదుర్గ విలేజ్‌ ఆర్గనైజేషన్‌ అసిస్టెంట్‌(వీఓఏ)గా పని చేస్తోంది. ఈ సంఘం పరిధిలో 32 డ్వాక్రా గ్రూపులుండగా వీటిలో 16 గ్రూపుల నుంచి సుమారు రూ.12 లక్షల మేర స్త్రీనిధి రుణాలను వీఓఏ కాజేసినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని డ్వాక్రా సంఘాల సభ్యులు చెబుతున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో స్త్రీనిధి జిల్లా మేనేజర్‌ ఎం.రత్నకుమారి మంగళవారం ఖండవల్లి వచ్చి విచారణ చేపట్టారు. తాము రుణాలు తీసుకోలేదంటూ ఈ సందర్భంగా డ్వాక్రా సభ్యులు ఆమె ఎదుట కన్నీరు పెట్టుకున్నారు.

ఆడిట్‌ చేయించకపోవటంతో..

మండలంలోని అన్ని గ్రామ సంఘాలకు ఈ నెల 12వ తేదీన ఆడిట్‌ నిర్వహిస్తున్నట్టు అధికారులు ముందస్తుగా సమాచారం ఇచ్చారు. దీనికి ఖండవల్లికి చెందిన 1, 7 గ్రామ సంఘాల వీఓఏలు వెళ్లలేదు. దీనిపై ఏపీఎం దుర్గ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 13వ తేదీ సాయంత్రానికి సంబంధిత పుస్తకాలు తీసుకుని రావాలని ఆదేశించారు. అయినప్పటికీ 7వ గ్రామ సంఘం వీఓఏ శ్రీదుర్గ స్పందించలేదు. దీంతో 14వ తేదీన ఏపీఎం దుర్గ స్వయంగా ఖండవల్లి వెళ్లారు. వీఓఏ శ్రీదుర్గ ఇంటి వద్ద లేదని చెప్పడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె వద్ద ఉన్న పుస్తకాలు తీసుకుని వీఓఏ విధుల నుంచి తొలగించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. అందుకు అనుగుణంగా వీఓఏ శ్రీదుర్గను కలిసేందుకు అధికారులు విఫలయత్నం చేశారు. ఈ నేపథ్యంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్‌ రత్నకుమారి ఆ గ్రామంలో స్వయంగా విచారణ చేపట్టారు. దీనికి గ్రామంలోని వీఓఏలందరూ హాజరైనా.. శ్రీదుర్గ రాకపోవటంతో రత్నకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ గ్రామ సంఘంలోని డ్వాక్రా సంఘాలతో భేటీ అయ్యారు. తాము ఈ విచారణకు వస్తే సొమ్ములు చెల్లించనంటూ శ్రీదుర్గ తమను బెదిరించిందని పలువురు సభ్యులు తెలిపారు. పల్లవి గ్రూప్‌ నుంచి రూ.లక్ష, సందీప్‌ గ్రూప్‌ నుంచి రూ.1.50 లక్షలు, వెన్నెల గ్రూప్‌ నుంచి రూ.60 వేలు.. ఇలా 16 సంఘాల నుంచి లక్షలాది రూపాయలు కాజేసినట్టు ఈ విచారణలో తేలింది. దీంతో జిల్లా మేనేజర్‌ రత్నకుమారి వీఓఏ శ్రీదుర్గ ఇంటికి వెళ్లేందుకు సంసిద్ధమయ్యారు. అదే తరుణంలో శ్రీదుర్గ తండ్రి అక్కడకు చేరుకున్నారు. తన కుమార్తె ఆరోగ్యం బాగోలేదని, ఆమె ఎంత చెల్లించాలో చెబితే అంతా తాను చెల్లిస్తానని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు.

దీనిపై ఈ నెల 27వ తేదీలోగా విచారణ పూర్తి చేసి, ఏయే సంఘాలకు ఎంత చెల్లించాలో నిర్ధారించాలని సిబ్బందిని రత్నకుమారి ఆదేశించారు. కాగా, ఈ విచారణకు కొన్ని సంఘాలు హాజరు కాలేదు. ఇదిలా ఉండగా, గ్రామంలో విచారణ చేపడితే తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ అధికారులను వీఓఏ బెదిరించినట్టు సమాచారం. తాను సొమ్ములు చెల్లించలేనని, స్వాహా విషయం బయటపెడితే ఆత్మహత్య చేసుకుంటానని, అందుకు బాధ్యులైన వారి పేర్లు రాస్తానని బెదిరించినట్లు విచారణలో తేలింది. దీనిపై అధికారులు ఆచితూచి అడుగు వేస్తున్నారు.

అన్నవరం స్వామి ఆదాయం.. అదిరింది

- సత్యదేవునికి రికార్డు స్థాయిలో హుండీల రాబడి
- 47 రోజులకు రూ.2.86 కోట్లు
- రోజుకు సగటున రూ.6.08 లక్షలు
- గతంలో రోజుకు రూ.4.73 లక్షలు మాత్రమే


ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్‌ రోహిత్‌, ఈఓ అజాద్‌

అన్నవరం: గడచిన నెలా పదిహేను రోజులుగా పెద్ద సంఖ్యలో జరిగిన వివాహాలు.. వేసవి సెలవులు.. పర్వదినాల వంటివన్నీ కలసి రావడంతో అన్నవరం సత్యదేవునికి దండిగా ఆదాయం సమకూరింది. హుండీల్లో రికార్డు స్థాయిలో కాసులు గలగలలాడాయి. దేవస్థానంలోని హుండీలను మంగళవారం తెరచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. స్వామి వారికి మొత్తం 47 రోజులకు రికార్డు స్థాయిలో రూ.2,86,21,018 ఆదాయం సమకూరిందని దేవస్థానం చైర్మన్‌ ఐవీ రోహిత్‌, కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌ అజాద్‌ తెలిపారు. దీంతో పాటు 65 గ్రాముల బంగారం, 570 గ్రాముల వెండి వస్తువులను భక్తులు కానుకలుగా సమర్పించారని వివరించారు. మొత్తం ఆదాయంలో రూ.2,76,12,933 మేర నగదు, రూ.10,08,085 మేర చిల్లర నాణేలు లభించాయన్నారు. విదేశీ కరెన్సీ కూడా పెద్ద మొత్తంలో వచ్చింది. యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ దిర్హామ్స్‌ 235, కెనడా డాలర్లు 30, అమెరికన్‌ డాలర్లు 1,640, న్యూజిలాండ్‌ డాలర్లు 20, ఇంగ్లండ్‌ పౌండ్లు 15, కువైట్‌ దీనార్లు 20, సౌదీ అరేబియా రియల్స్‌ 110, మాల్దీవుల రుపియాలు 10, మలేషియా రింగిట్స్‌ 5, సింగపూర్‌ డాలర్లు 12 లభించాయి. హుండీల ఆదాయం లెక్కింపులో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు పేరూరి బద్రీనారాయణ, అసిస్టెంట్‌ కమిషనర్‌ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి పి.నారాయణమూర్తి, ఎంఎం వీరభద్రరావు, దేవస్థానం సిబ్బంది, పురోహితులు, నాయీబ్రాహ్మణులు, స్వచ్ఛంద సేవల సిబ్బంది పాల్గొన్నారు.

కలసి వచ్చిన పెళ్లిళ్లు, సెలవులు

వివాహాల సీజన్‌ కావడంతో వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో నవదంపతులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని సన్నిధికి ఆలయానికి పోటెత్తారు. అలాగే, విద్యాసంస్థలకు వేసవి సెలవులు కావడంతో కూడా అధిక సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలి వచ్చారు. వీరందరూ స్వామివారికి దండిగా కానుకలు సమర్పించారు. దీనికితోడు దేవస్థానంలో ప్రధానంగా పశ్చిమ రాజగోపురం వద్ద గ్రెిల్లకు అడ్డుకట్ట వేసి, భక్తులు నేరుగా స్వామివారిని దర్శించే ఏర్పాట్లు చేయడం, దేవస్థానంలో గర్భాలయ దర్శనం వలన కూడా భక్తులు హుండీల్లో కానుకలు సమర్పించారు. గత నెలలో 37 రోజులకు రూ.1.75 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అంటే రోజుకు సగటున రూ.4.73 లక్షలు వచ్చినట్టు. ఈసారి రోజుకు సగటున రూ.6.08 లక్షల ఆదాయం సమకూరడం గమనార్హం.

గంజాయిపై నిరంతర నిఘా

- శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన బాధ్యత
- ఏలూరు రేంజ్‌ డీఐజీ అశోక్‌ కుమార్‌ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ అశోక్‌ కుమార్‌. చిత్రంలో ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గంజాయి రవాణాపై నిఘా పెంచి, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని ఏలూరు రేంజ్‌ డీఐజీ జీవీజీ అశోక్‌ కుమార్‌ ఆదేశించారు. పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సీహెచ్‌ సుధీర్‌కుమార్‌రెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం, స్థితిగతులు, రాజకీయ, భౌతిక నేపథ్యాలను వివరించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ, శాంతిభద్రతలు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యతని అన్నారు. రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని, రాత్రి వేళల్లో గస్తీ పెంచి, చోరీలు జరగకుండా చూడాలని ఆదేశించారు. మహిళలు, బలహీన వర్గాలపై జరిగే దాడులపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి, నిర్ణీత సమయంలో నిందితులను అరెస్టు చేసి, చార్జిషీట్లు దాఖలు చేయాలని అన్నారు. పోలీసు అధికారులందరూ తమ స్టేషన్‌ పరిధిలోని విద్యా సంస్థల్లో సదస్సులు నిర్వహించి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌, డీసీఆర్‌బీ, స్పెషల్‌ బ్రాంచ్‌, ఐటీ కోర్‌, కమాండ్‌ కంట్రోల్‌, డయల్‌ 100 విభాగాలను డీఐజీ తనిఖీ చేశారు. స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ను సందర్శించారు.

దిశ పోలీస్‌ స్టేషన్‌ తనిఖీ : స్థానిక దిశ పోలీస్‌ స్టేషన్‌ను డీఐజీ అశోక్‌కుమార్‌ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్‌ కౌంటర్‌, హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదీలతో గౌరవంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పోక్సో కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ మహిళా కార్యదర్శులకు విధులపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్‌ పంకజ్‌కుమార్‌ మీనన్‌, అడిషనల్‌ ఎస్పీలు ఎస్‌ఆర్‌ రాజశేఖర్‌రాజు, ఎం.రజని, జి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, పి.సోమశేఖర్‌ పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర


కోలాహలంగా సాగుతున్న జగన్నాథుని రథోత్సవం


రథంపై భక్తులకు దర్శనమిచ్చిన బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుడు


రథయాత్రలో పాల్గొన్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతూ దేవుని దర్శనానికి కూడా నోచుకోని వారిని ఆనంద పరవశుల్ని చేయడానికే ఆ జగన్నాథుడు స్వయంగా జనం మధ్యకు వచ్చారని తిరుపతి ఇస్కాన్‌ శాఖ అర్చకుడు రేవతి రమణదాస్‌ అన్నారు. ఇస్కాన్‌ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యాన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుని విగ్రహాలను రథంపై ఉంచి ఘనంగా ఊరేగించారు. కంబాలచెరువు పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర దేవీచౌక్‌, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం, పుష్కర ఘాట్‌, మార్కండేయేశ్వర స్వామి గుడి, టి.నగర్‌, కోటిపల్లి బస్టాండ్‌, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్‌ మందిరానికి చేరుకుంది. కళాకారుల ప్రదర్శనలు, భక్తుల కీర్తనలు, భజనలతో యాత్రా పథం అద్యంతం ఆధ్యాత్మికత పరిమళించింది. ఇస్కాన్‌ రామహేంద్రవరం శాఖ చైర్మన్‌ శ్యామాంగ శ్రీనివాసదాస్‌ మాట్లాడుతూ, జగన్నాథుని రథయాత్ర ఏటా వైభవంగా జరిగేదని, కరోనా కారణంగా నిలిచిపోయిందని, ఈసారి కొత్త రథంపై భారీ ఎత్తున నిర్వహించామని అన్నారు. రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్‌ మేడపాటి షర్మిలారెడ్డి కంబాల చెరువు వద్ద రథయాత్రలో పాల్గొని, స్వామి వారి ఆశీస్సులు పొందారు.

స్టాఫ్‌ నర్సుల బదిలీలు ప్రశాంతం


బదిలీల కౌన్సెలింగ్‌లో ఆర్‌డీ డాక్టర్‌ పద్మ శశిధర్‌

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్య శాఖ జోన్‌ – 2 పరిధిలోని స్టాఫ్‌ నర్సులకు మంగళవారం బదిలీ కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్‌ జిల్లాల్లోని ఉద్యోగులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వెనుక ఉన్న వైద్య, ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకుల (ఆర్‌డీ) కార్యాలయానికి వచ్చారు. రెండో రోజు 47 మంది స్టాఫ్‌ నర్సులు, 35 మంది గ్రేడ్‌–2 ఫార్మసిస్టులు, సీనియర్‌ అసిస్టెంట్లకు బదిలీలు నిర్వహించారు. ఈ ప్రక్రియ ఈ నెల 22 వరకూ కొనసాగుతుందని ఆర్‌డీ డాక్టర్‌ పి.పద్మ శశిధర్‌ తెలిపారు.